9

సాక్షి అనకాపల్లి

శనివారం । 20 । మే । 2023

న్యూస్‌రీల్

విద్యా కానుకలో నాణ్యమైన సామగ్రి

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్
- అర్ధరాత్రి వేళ కశింకోట హైస్కూలు ఆకస్మిక తనిఖీ



జగనన్న విద్యా కానుక షూను పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

కశింకోట: జగనన్న విద్యా కానుకలో నాణ్యమైన వస్తువులను అందిస్తున్నట్టు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ చెప్పారు. కశింకోట బాలికల హైస్కూలును ఆయన శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ స్టాక్ చేసిన విద్యా కానుక కిట్లను పరిశీలించారు. షూ వేసుకొని చూశారు. పాఠ్య పుస్తకాలు, వగైరా కూడా పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ జరుగుతున్న నాడు–నేడు పనులపై ఎంఈఓ చిట్టిబాబును ఆరా తీశారు. ఆయన పర్యటనలో ఆర్‌జేడీ జ్యోతికుమారి, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి లక్ష్మి, ఇంజనీర్ మృత్యుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.

డీసెట్-2023 దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం: డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశం కొరకు నిర్వహించే డీసెట్-2023కు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ యు. మాణిక్యం నాయుడు తెలిపారు. ఈ నెల 28 వరకు దరఖాస్తుకు గడువు ఉందన్నారు. ఎంట్రన్స్ పరీక్ష ద్వారానే ప్రభుత్వ, గుర్తింపు పొందిన కాలేజీల్లో ఉపాధ్యాయ విద్య శిక్షణ అభ్యసించే అవకాశం ఉంటుందన్నారు.

డీఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కు పదోన్నతి



కడప ఎస్‌ఈబీ అదనపు ఎస్పీగా నియామకం

నర్సీపట్నం: నర్సీపట్నం డీఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్‌కు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం కడప ఎస్ఈబీ అదనపు ఎస్పీగా బదిలీ చేసింది. అనకాపల్లి జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం డీఎస్పీగా పనిచేస్తూ, గత ఏడాది సెప్టెంబర్ నుంచి నర్సీపట్నం ఇన్‌చార్జి డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. పదోన్నతి పొందడంతో కడపకు బదిలీ అయ్యారు. నర్సీపట్నం ఏఎస్పీగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

ఎయిడ్స్ మృతుల ఆత్మశాంతికి రేపు కొవ్వొత్తుల ర్యాలీ

అనకాపల్లి టౌన్: ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందిన రోగులకు ఆత్మశాంతి కలగాలని ఈనెల 21న సాయంత్రం ఎన్టీఆర్ ఆసుపత్రి నుంచి మెయిన్‌రోడ్డులో క్రీడామైదానం వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్న రోగులకు స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు, యువత, ప్రభుత్వ, ప్రభుత్వేతర అధికారులు తమ వంతు సహాయం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థినులు 'జగనన్న ఆణిముత్యాలు'





అవార్డులకు ఎంపికైన లలితా సిరిశ్రీ, తులసి

నర్సీపట్నం: ప్రభుత్వం ప్రకటించిన 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా ఏపీ మోడల్ స్కూల్ వేములపూడి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. రాష్ట్రస్థాయిలో పి.లలితా సిరిశ్రీ, వి.తులసిలకు ద్వితీయ, జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించారని ప్రిన్సిపాల్ కె.సంధ్య తెలిపారు. ఘనవిజయం సాధించిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

డీసీఐ చైర్మన్‌గా అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) చైర్మన్, అదనపు డైరెక్టర్‌గా విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ డా. మదేయాన్ అంగముత్తు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను డీసీఐ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ శుక్రవారం జారీ చేశారు. త్వరలో నిర్వహించే డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నిర్వహించే వార్షిక సర్వసభ్య సమావేశంలో తదుపరి నిర్ణయం తీసుకోనున్నామని అంతవరకూ డా.అంగముత్తు చైర్మన్‌గా వ్యవహరిస్తారని డీసీఐ స్పష్టం చేసింది.

చంద్రబాబూ గోబ్యాక్



నెహ్రూ చౌక్ సెంటర్లో గో బ్యాక్ బ్యానర్లతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ధర్నాలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు

నిరసన నినాదాలతో దద్దరిల్లిన అనకాపల్లి

అనకాపల్లి టౌన్: గోబ్యాక్ నినాదాలతో అనకాపల్లి హోరెత్తింది. బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వం ఇస్తున్న సెంటుభూమి శవాలను కప్పెట్టడానికి కూడా సరిపోదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పెందుర్తి సభలో వ్యాఖ్యానించడంపై నిరసన వెల్లువెత్తింది. శుక్రవారం అనకాపల్లి పర్యటనకు వచ్చిన సందర్భంగా.. ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజల ద్రోహి చంద్రబాబు గోబ్యాక్.. గోబ్యాక్ అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు అనకాపల్లిలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ప్లకార్డులు ప్రదర్శిస్తూ భారీ ర్యాలీ, మానవహారం జరిపారు. స్థానిక నెహ్రూచౌక్‌లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. మానవహారంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. కనీస ఇంగితజ్ఞానం లేకుండా చంద్రబాబు మాట్లాడడం విడ్డూరంగా ఉందని, 2024 ఎన్నికల్లో టీడీపీని రాష్ట్ర ప్రజలు మరోసారి ఇంటికి పంపించడం ఖాయమని చెప్పారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ దేశవ్యాప్తంగా 5 లక్షల గృహాలను బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇస్తే, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 32ల క్షల మంది నిరుపేదలకు ప్రభుత్వ స్థలం అందజేసి గృహాలు నిర్మిస్తున్నారని చెప్పారు. టీడీపీ నేత చంద్రబాబునాయుడు అవాకులు చవాకులు పేలితే ప్రజలు సహించరన్నారు. చంద్రబాబునాయుడు 2024 తరువాత రాష్ట్ర సైకోగా మారే సూచనలు కనిపిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే చంద్రబాబునాయుడు ఓర్వలేకపోతున్నట్లు చెప్పారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజల నుంచి నగదు దోచుకున్న రోజులు మర్చిపోయారా అని ఆయన ప్రశ్నించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పి.జోసెఫ్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మరిపల్లి శోభ, మండల పార్టీ కార్యదర్శి భీశెట్టి జగన్ పాల్గొన్నారు.



సభా స్థలిలోనే మత్తులోకి జారుకున్న మందుబాబు

అనకాపల్లివాసుల ఇక్కట్లు

అనకాపల్లి టౌన్: చంద్రబాబు రాకతో శుక్రవారం సాయంత్రం వాహన చోదకుల్లో అయోమయం ఏర్పడింది. ఎటు వైపు వెళ్దామన్నా రహదారికి అడ్డు తగలడం, ఆపై ప్రధాన రహదారిని పూర్తి స్థాయిలో మూసివేయడంతో పట్టణవాసులు నానా యాతన పడ్డారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు రావాల్సిన చంద్రబాబు స్థానిక నెహ్రూచౌక్‌కు రాత్రి 7 గంటలకు రావడంతో తెలుగు తమ్ముళ్లలో ఉత్సాహం ఆవిరైపోయింది. గ్రామాల నుంచి తరలించిన వృద్ధులు వెళ్లే దారి లేక అవస్థలు పడ్డారు. సుంకరమెట్ట కూడలి నుంచి ప్రధాన రహదారి అయిన నెహ్రూచౌక్ వరకు టీడీపీ కటౌట్లు, హోర్డింగ్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రజలు ట్రాఫిక్ దిగ్బంధనంలో చిక్కుకున్నారు. బహిరంగసభలో చంద్రబాబు పసలేని ప్రసంగం, నోట్ల రద్దును తానే సిఫార్సు చేశానంటూ చెప్పుకున్న గొప్పలు జనానికి విసుగు తెప్పించింది. చల్లనిగాలులు వీయడంతో వర్షం పడుతుందన్న భయంతో జనం జారుకున్నారు.



ప్రధాన రహదారికి ఇరువైపులా టీడీపీ కటౌట్లు, హోర్డింగులు అమర్చడంతో మూతపడ్డ దుకాణాలు

మాకు ఇదేం ఖర్మ?

- అనకాపల్లివాసుల ఆపసోపాలు
- ప్రధాన రహదారి మూసివేత
- టీడీపీ కటౌట్లు, హోర్డింగ్‌లతో చిరు వ్యాపారాలకు దెబ్బ

అనకాపల్లి టౌన్: కటౌట్లు, హోర్డింగులతో దుకాణాలు మూతపడ్డాయి. చిరు వ్యాపారులు కుదేలయ్యారు. కృత్రిమ రద్దీతో ఏర్పడ్డ ట్రాఫిక్ జామ్ పట్టణవాసులకు నరకం చూపించింది. చంద్రబాబూ.. మాకు ఇదేం ఖర్మ అంటూ జనం మండిపడ్డారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కార్యక్రమాల కోసం పార్టీ నేతలు చేసిన హడావుడి ప్రజలకు ఇక్కట్లు కలిగించింది. శుక్రవారం సాయంత్రం జరిగే బాబు షోను పురస్కరించుకొని టీడీపీ కార్యకర్తలు గురువారం రాత్రి నుంచి చేసిన హడావుడితో చిరువ్యాపారస్తులు వ్యాపారాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం చుర్రుమన్న సూరీడు, సాయంత్రం చంద్రబాబు 'షో' వల్ల.. రోడ్డుకిరువైపులా నిర్వహించుకునే చిల్లర వ్యాపారాలు దెబ్బతిన్నాయనే చెప్పాలి. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణల ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ తోపాటు పట్టణంలో రహదారికి ఇరువైపులా పసుపు రంగు జెండాలు, పెద్ద కటౌట్లు, బ్యానర్లు ఏర్పాటు చేయడంతో వ్యాపార సముదాయాలకు వెళ్లే కొనుగోలుదార్లకు దారే లేకుండా పోయింది. రహదారి పక్కన చిన్నా చితకా వ్యాపారాలు చేసుకునే వారికి ఈ కటౌట్లు దెబ్బతీశాయంటూ గగ్గోలు పెడుతున్నారు. జాతీయ నాయకుడైన నెహ్రూ విగ్రహం చుట్టూ పసుపురంగు జెండాలు వేలాడతీయడంతో కమ్యూనిస్టులతోపాటు మేధావివర్గాలు పెదవిరుస్తున్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం చుట్టూ టీడీపీ హోర్డింగ్‌లతో అంబేడ్కర్ విగ్రహం కనిపించనేలేదు. ప్రధాన రహదారులన్నీ దిగ్బంధించారు. దీంతో చిన్న వీధుల్లో కూడా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. పలు గ్రామాల నుంచి పండుటాకులను సైతం తరలించడంతో వారు.. ముందుకు వెళితే గొయ్యి, వెనక్కు వెళితే నుయ్యి.. అన్న చందాన ఇబ్బందులు పడ్డారు. ఎటూ వెళ్లలేక వారొచ్చిన ఆటోలోనే కాలక్షేపం చేయాల్సి వచ్చింది.

జనసేన కార్యకర్తలేరీ?

చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ అభిమానులు రాకపోవడం, జనసేన జెండాలు కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. పొత్తు కోసం తహతహలాడుతున్న తమ నాయకుడి మనోగతాన్ని కార్యకర్తలు పట్టించుకున్నట్టు లేదు. జనసేన వర్గాలు చంద్రబాబు రోడ్డుషోకు దూరంగా ఉండడం టీడీపీ వారిని నిరాశకు గురి చేసింది.



నెహ్రూచౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి కట్టేసిన టీడీపీ హోర్డింగ్‌లు



ఆటోలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్న వెంకుపాలెం గ్రామానికి చెందిన పండుటాకులు

వలంటీర్ల సేవలు నిరుపమానం



సేవా పురస్కారాలు పొందిన వలంటీర్లతో ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

- వారే సంక్షేమ సారథులు
- ఎంపీ డాక్టర్ సత్యవతి
- కలెక్టర్‌తో కలిసి సేవా పురస్కారాల ప్రదానం

తుమ్మపాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరికీ అందించే గ్రామ, వార్డు వలంటీర్లు సంక్షేమ సారథులని ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ఆమె జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుతో కలిసి వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అందించే అన్ని సంక్షేమ పథకాలను అర్హులకు అందించే బాధ్యత తీసుకుని వలంటీర్లు సేవలు అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ ద్వారానే పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పింఛన్లు, అమ్మ ఒడి, రైతు భరోసా వంటి అన్ని పథకాలు సకాలంలో అందుతున్నాయన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్ వ్యవస్థ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తుందన్నారు. జిల్లాలో అన్ని సచివాలయాల నుంచి 34 మందిని సేవా వజ్ర, 135 మందిని సేవా రత్న, 7800మందిని సేవామిత్ర అవార్డులకు ఎంపిక చేసి వారికి పురస్కారాలు అందించి ప్రోత్సహించామన్నారు. అంతకుముందు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో పాల్గొన్న సభను ప్రత్యక్ష ప్రసారం ద్వారా అందరూ వీక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.వరాహ సత్యవతి, డీఆర్వో పి.వెంకటరమణ, జీఎస్ఎంఎస్ ప్రత్యేక అధికారి మంజులావాణి, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, కశింకోట జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు, వలంటీర్లు పాల్గొన్నారు.

పలు రైళ్లు దారి మళ్లింపు, కొన్ని రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్ డివిజన్ చర్లపల్లి–ఘట్‌కేసర్ సెక్షన్ మధ్య జరుగుతున్న భద్రతా పనుల నిమత్తం పలు రైళ్లు రీషెడ్యూల్, మరికొన్ని దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె. త్రిపాఠి తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని కోరారు.



నేడు రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- హౌరా–సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా ఉదయం 11.35 గంటలకు బయలుదేరుతుంది.
- భువనేశ్వర్–ముంబయి(11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరుతుంది.
- విశాఖపట్నం–లోకమాన్యతిలక్ టెర్మినస్(18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్య రాత్రి 12.20 గంటలకు బయలుదేరుతుంది.

దారి మళ్లించిన రైళ్లు

- విశాఖపట్నం–లోకమాన్యత తిలక్ టెర్మినస్ (18519) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు వయా విజయవాడ, కృష్ణా కెనాల్ జంక్షన్, గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- షాలిమార్–సికింద్రాబాద్ (22849) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24, 31 తేదీల్లో వయా ఏలూరు, విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా ప్రయాణిస్తుంది.
- యశ్వంత్‌పూర్–టాటానగర్ (18112) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21, 28, జూన్ 4 తేదీల్లో వయా సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు మీదుగా ప్రయాణిస్తుంది.
- హైదరాబాద్–షాలిమార్ (18046) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28, జూన్ 7 తేదీన వయా గుంటూరు, పగిడిపల్లి, సికింద్రాబాద్ మీదుగా ప్రయాణిస్తుంది
- సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా విశాఖపట్నం–అమృత్‌సర్(20807)హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27న వయా విజయనగరం, టిట్లాఘడ్, సంబల్‌పూర్ మీదుగా నడుస్తుంది.

శొంఠ్యాంలో ఆయుర్వేద ఔషధ ఉత్పత్తి కేంద్రం

ఆనందపురం: ఆనందపురం మండలం శొంఠ్యాంలో భారత్ ఆయుష్మాన్ పథకం కింద రాష్ట్రస్థాయి ఆయుర్వేద ఔషధ ఉత్పత్తి కేంద్రం, ఔషధ పరీక్ష ప్రయోగశాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విభజనకు ముందు హైదరాబాద్‌లోని ఆయుర్వేద ఫార్మసీ నుంచి రాష్ట్రంలోని ఆయుర్వేద ఆస్పత్రులకు మందులు సరఫరా అయ్యేవి. రాష్ట్ర విభజన అనంతరం మందులు సరఫరా నిలిచిపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి మందులు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 120 ఏళ్ల నుంచి నడుస్తున్న శొంఠ్యాం ఆయుర్వేద వైద్యశాల వద్ద ఔషధ ఉత్పత్తి కేంద్రం, ఔషధ ప్రయోగశాలను ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఇక్కడ నుంచే అన్ని ఆయుర్వేద ఆస్పత్రులకు మందులు సరఫరా అవుతాయి. భవన నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రెండెకరాల స్థలాన్ని కేటాయించగా, కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ పనులను ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపట్టనుంది.

నిరుద్యోగుల నేస్తం.. స్కిల్ డెవలప్‌మెంట్ హబ్



కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు



కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

చోడవరం రూరల్: ఉన్నత చదువులను పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో విసిగి వేసారిన గ్రామీణ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ చుక్కానిలా పని చేస్తోంది. ఐటీ రంగంవైపు అడుగులు వేసే ఉన్నత విద్యావంతుల పాలిట వరంగా మారింది. జిల్లాలోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌ను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి ఉన్నత విద్య వరకు పలు రకాల పథకాలతో ఆర్థికంగా వెన్నంటి ఉండడమే గాకుండా ఉద్యోగాన్వేషణలోనూ తోడుగా నిలవడం పట్ల నిరుద్యోగులలో ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది. చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో కంప్యూటర్ కోర్సులతోపాటు గ్రామీణ మహిళలు, గృహిణులకు ఉపకరించే కుట్టుమిషన్‌లతో కూడా శిక్షణ ఇస్తున్నారు. ఇది కుటుంబపోషణలో తమ వంతు ఆదాయాన్ని సముపార్జించుకునేందుకు వారికి ఎంతో సహాయకారిగా ఉంటుంది. అంతేగాకుండా మరికొందరు బ్రాండిక్స్ వంటి డ్రెస్ మెటీరియల్ తయారీ కంపెనీలలో ఉద్యోగాలను పొందడానికి దోహదం చేస్తుంది. ఒక్కొక్క బ్యాచ్‌కు 30 మంది మహిళలకు కుట్టు మిషన్ ఆపరేటర్లుగా కుట్టు, ఎంబ్రాయిడరీలలో శిక్షణ ఇస్తున్నారు. వీరికి 275 గంటల శిక్షణ అందిస్తున్నారు. ఇప్పటికే ఒక బ్యాచ్ శిక్షణ పూర్తి కాగా ఈ నెల 6 నుంచి రెండవ బ్యాచ్ శిక్షణ ప్రారంభమయ్యింది. కంప్యూటర్ కోర్సులను మార్చి 10 నుంచి ప్రారంభించారు. అసోసియేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్, డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్ కోర్సులను అందిస్తున్నారు. కంప్యూటర్ కోర్సులలో శిక్షణ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంటుంది. మూడు నెలలపాటు 400 గంటల శిక్షణ ఇస్తారని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఇటు ఉన్నత విద్యావంతులకు కంప్యూటర్ రంగంలోనూ, ఇతరులకు కుట్టుశిక్షణలోనూ నైపుణ్యాభివృద్ధికి స్కిల్ హబ్ ద్వారా అందుతున్న సేవలు నిరుద్యోగితను తరిమి ఉద్యోగులుగా మారడానికి ఉపకరించడం ద్వారా యువతకు దార్శనికంగా ఉండడం అభినందనీయం కదా.


స్వయం ఉపాధితోపాటు ఉద్యోగం పొందే చాన్స్



కుట్టు శిక్షణలో ప్రతీ బ్యాచ్‌లో 30 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తయ్యింది. వీరంతా వారివారి ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందే వీలుంది. లేడీస్ డ్రస్, బ్లౌజ్, ఫ్రాక్స్, పెట్టీకోట్‌ల కటింగ్, స్టిచింగ్‌లలో శిక్షణ ఇచ్చాం. వీరు బ్రాండిక్స్ కంపెనీలో ఉద్యోగం పొందే అవకాశం ఉంది. అయితే శిక్షణ తీసుకున్న వారు ఉద్యోగాలు పొందిన వివరాలు మా వద్ద లేవు.

–విస్సారపు శారద, ట్రైనర్, సూయింగ్ మెషిన్, చోడవరం స్కిల్ హబ్

విశాఖలోని ఐటీ కంపెనీలతో అనుసంధానిస్తున్నాం



అనకాపల్లి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలోను స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేశాం. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన స్కిల్ హబ్‌లలో నైపుణ్య శిక్షణ అందివ్వడంతోపాటు ఉద్యోగ సాధనలోనూ వారికి సహకరిస్తున్నాం. విశాఖలోని పలు ఐటీ కంపెనీలకు వీరిని సిఫారసు చేస్తున్నాం. వారి వారి అవసరాల మేరకు వీరిని ఎంపిక చేసుకునే వీలుంది. అలాగే ఉద్యోగ మేళాల ద్వారా నిరుద్యోగులకు ఊతం అందిస్తున్నాం.

–చాముండేశ్వరరావు, జిల్లా కో ఆర్డినేటర్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

నిరంతరం బ్యాచ్‌లవారీగా శిక్షణ



ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో షూయింగ్ మిషన్ ఆపరేటర్ శిక్షణను ప్రారంభించాం. ఇప్పటికే ఒక బ్యాచ్ శిక్షణ ముగిసింది. వీరంతా దాదాపు స్వయం ఉపాధి పొందుతున్నారు. వారు నేరుగా బ్రాండిక్స్‌లో ఉద్యోగానికి ప్రయత్నం చేసుకునే వీలుంది. కంప్యూటర్స్‌లో ఎం.ఎస్.వర్డ్, ఎక్సెల్, పవర్ పాయింట్ ప్రజంటేషన్, టైపింగ్ స్కిల్స్ నేర్పుతున్నాం. రెండు విభాగాలలో శిక్షణ ఇస్తున్నాం. త్వరలో ఒక బ్యాచ్ శిక్షణ ముగియనున్నది. అటు తర్వాత మరో బ్యాచ్‌కు శిక్షణ కొనసాగుతుంది.

–పోలిపర్తి శ్రీనివాసరావు, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్, చోడవరం

శిక్షణ బాగుంది



ఇక్కడ ఇస్తున్న కంప్యూటర్ శిక్షణ బాగుంది. రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్వ్యూను ఫేస్ చేయగల నమ్మకం వచ్చింది. ఇటీవల జరిగిన జాబ్ మేళాలో ది ప్లేస్‌మెంట్‌పార్కు కంపెనీకి రెజ్యూమె ఇచ్చాను. వారు తర్వాత కాల్ చేస్తామన్నారు. ఇంటర్మీడియట్ చేసా. డిగ్రీ కూడా చేస్తున్నాను. మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఉద్యోగాల్లో త్వరగా స్థిరపడగలుగుతాం.

–శ్రావణి, శిక్షణ పొందుతున్న విద్యార్థిని, చోడవరం

వడదెబ్బకు తాపీమేస్త్రి మృతి


మృతుడు సోడే అప్పారావు(ఫైల్)

మాడుగుల రూరల్ : మండలంలో ఎం. కోడూరు గ్రామానికి చెందిన తాపీ పనిచేసే మేస్త్రీ సోడే అప్పారావు(69) వడదెబ్బతో శుక్రవారం మృతి చెందారు. అప్పారావు మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి, తిరిగి పని చేస్తుండగా అప్పారావు తీవ్ర అస్వస్థతకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. అప్పారావుకు భార్య, నలుగురు కుమార్తెలు వున్నారు. మృతుడి కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవి రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పల నాయుడు, తదితరులు పరామర్శించారు.

అప్పన్న హుండీల ఆదాయం రూ.3.05 కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామి హుండీల ఆదాయం లెక్కింపు రెండవ రోజైన శుక్రవారం కొనసాగింది. ఈ లెక్కింపులో రూ.1,15,55,513 ఆదాయం వచ్చినట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. నగదుతో పాటు 94.510 గ్రాముల బంగారం, 9.135 కిలోల వెండి లభించినట్లు వెల్లడించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గురువారం జరిగిన లెక్కింపులో 1,89,90,670 ఆదాయం రాగా.. శుక్రవారం లెక్కించిన ఆదాయం కలిపి 3,05,46,183 వచ్చినట్లు ఈవో తెలిపారు.

ఆదర్శ గ్రామాలు సమగ్ర అభివృద్ధి సాధించాలి


ఎస్ఏజీవై సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, ఎంపీ బీవీ సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబురావు

తుమ్మపాల: ఆదర్శ గ్రామాలను అన్ని రంగాల్లోను మరింత అభివృద్ధి చెందేలా అధికారులు కృషి చేయాలని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో సంసద్ ఆదర్శ గ్రామ యోజన పథకం (ఎస్ఏజీవై) అమలుపై అన్ని శాఖల అధికారులతో ఆమె కలెక్టర్‌తో కలిసి సమీక్షించారు. ఎంపీ నిధులతో చేపడుతున్న పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. జాతీయ రహదారులు, రైల్వే సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ఎక్కడైనా పనులకు ఆటంకాలు ఏర్పడితే తమకు తెలపాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులకు సూచించారు. సమస్య పూర్తి వివరాలతో తమకు తెలపాలని, తక్షణమే సంబంధిత అంశంపై విచారణ చేపట్టి పనులు వేగవంతానికి కృషి చేస్తానన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే గొల్ల బాబురావు వివరించారు. ముఖ్యంగా ఆదర్శ గ్రామాలు గొలుగొండ మండలం ఏఎల్‌పురం, మునగపాక మండలం గణపర్తి, సబ్బవరం మండలం మొగలిపురం గ్రామాల్లో అభివృద్ధిని గూర్చి చర్చించారు. కోనాం జలాశయంలో నీరు ఎక్కువగా ఉన్నప్పుడు గిరిజనుల రాకపోకలకు వీలుగా రహదారి నిర్మాణానికి రూ.40 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఎంపీ, ఎమ్మెల్యే గ్రాంట్లు, వివిధ శాఖల నిధులతో చేపడుతున్న పనులను సమన్వయపరచి నిధులు సమకూర్చనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు మలేషియాలో జరిగిన కరాటే పోటీలలో బహుమతులు గెలుచుకున్న సబ్బవరం మండలానికి చెందిన సాయి సురేంద్రను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, జెడ్పీ సీఈవో శ్రీరామ్ మూర్తి, సీపీవో జి.రామారావు, డ్వామా పీడీ సందీప్, డీఎంహెచ్‌వో హేమంత్, డీపీవో శిరీషారాణి, ఆర్అండ్‌బీ ఈఈరమేష్, పీఆర్ ఈఈ వీరునాయుడు ఓఎస్‌డీ పోలినాయుడు ఆయా మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలి

తుమ్మపాల : బాలల హక్కులను పరిరక్షిస్తూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం స్త్రీ శిశు, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు, సంస్థలు, గృహాల్లో ఎక్కడా బాల కార్మికులు ఉండరాదని సూచించారు. బాలల హక్కుల పట్ల సమాజంలో పూర్తి అవగాహన కల్పించాలని, వారిని కార్మికులుగా ఉపయోగించుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు గ్రామ మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని, గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్ మెంబర్లుగా, మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, సీడీపీవోలు మెంబర్లుగా ఏర్పడాలని సూచించారు. క్వారీలు, ఇటుక బట్టీలు, హోటళ్లపై అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించాలని ఆదేశించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో స్వచ్ఛంద సేవాసంస్థలు ప్రధాన భూమిక పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ ఉషారాణి, డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ, డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, ఐసీడీఎస్ సీడీపీవోలు, స్వచ్ఛంద సేవాసంస్థలు సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి


మృతుడు యాచకుడు

అనకాపల్లిటౌన్ : రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని యాచకుడు(38) శుక్రవారం మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ నరసింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం–అనకాపల్లి రహదారిలో ఓ యాచకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కోడూరు వీఆర్వో సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలో భద్రపరిచినట్లు ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని గుర్తించిన వారు ఫోన్ 9440796085ను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

కొబ్బరి పీచు పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం
- రూ.కోటి ఆస్తి నష్టం


పీచు పరిశ్రమలో అగ్ని కీలలు

రాంబిల్లి : స్థానిక రాధాస్వామి కొబ్బరి పీచు పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు రాధా సుందర సుబ్బరాజు(కిషోర్)కి చెందిన ఈ పరిశ్రమలో అగ్ని ప్రమాదం కారణంగా రూ.కోటి ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ పరిశ్రమలో కొబ్బరి ఉప ఉత్పత్తులు తయారవుతాయి. కొబ్బరి పీచుతో పలు రకాల సామాగ్రికి ఉపయోగపడే సరుకును తయారు చేసి పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అకస్మాత్తుగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో కిషోర్, ఆయన తండ్రి చంటిరాజు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. యలమంచిలితో పాటు సెజ్ ప్రాంతం నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ముడి కొబ్బరి పీచు, యంత్ర సామాగ్రి దెబ్బతిందని కిషోర్ తెలిపారు.

పీఎంఈజీపీలో పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు

కశింకోట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం (పీఎంఈజీపీ) కింద యువతీ, యువకులకు ఈ ఏడాది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు, సేవా పరమైన యూనిట్లు, ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకోవడానికి రూ.50 లక్షల వరకు రుణాన్ని అందివ్వనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. దీనిలో రూ.20 లక్షల వరకు సేవా పరమైన యూనిట్లు, రూ.50 లక్షల వరకు ఉత్పత్తి యూనిట్లు నెలకొల్పుకోవచ్చునన్నారు. ఉపాధి కల్పన కార్యక్రమానికి వ్యక్తులు, చేతి వృత్తి పని వారు, రిజిస్టర్ అయిన స్వచ్ఛంద, దాతృత్వ సంస్థలు, ట్రస్టులు, సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు అర్హులన్నారు. జనరల్ కేటగిరి వారైతే గ్రామాల్లో ప్రాజెక్టు పెట్టుబడిలో పది శాతం, అదే 20 వేల లోపు జనాభా కలిగిన గ్రామీణ ప్రాంతాల్లో అయితే 25 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మహిళ, మైనార్టీ, ఎక్స్ సర్వీస్‌మెన్, దివ్యాంగులకు చెందిన వారు 5 శాతం, 20 వేల లోపు జనాభా ఉన్న గ్రామీణ ప్రాంతంలో 35 శాతం వంతున తమ వాటాగా నిధులు సమకూర్చాల్సి ఉంటుందన్నారు. రూ. పది లక్షల పైబడిన పెట్టుబడితో ఉత్పత్తి యూనిట్లు, రూ.5 లక్షలు పైబడిన పెట్టుబడితో సేవా యూనిట్లు నెలకొల్పుకోవడానికి అభ్యర్థుల కనీస విద్యార్హత 8వ తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 18 ఏళ్లు దాటి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తుతో పాటు ప్రాజెక్టు రిపోర్టు, ఆధార్ కార్డు, విద్యార్హతలు, గ్రామీణ ప్రాంత జనాభా ధ్రువీకరణ పత్రం, పాసుపోర్టు సైజు ఫోటోలతో www.kviconine.gov.in చిరునామాకుగాని, pmefpeportal వెబ్‌సైట్ ద్వారాగాని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంకా పూర్తి వివరాలకు పరిశ్రమల శాఖ ప్రోగ్రాం అధికారి సెల్ నెంబర్ 7997952314 కు సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన గోవింద (ఫైల్)

మాకవరపాలెం : రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. మండలంలోని రాచపల్లికి చెందిన బేతా గోవింద(39) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. స్థానికంగా పనులు లేక ఇబ్బందులు పడుతున్న గోవింద భార్య, ఇద్దరు పిల్లలతో ఆరు నెలల క్రితం దువ్వాడ బతుకు దెరువు కోసం వెళ్లాడు. అక్కడ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాచపల్లిలో కామేశ్వరమ్మ పండగ కావడంతో మూడు రోజుల క్రితం భార్య, పిల్లలు గ్రామానికి చేరుకున్నారు. గోవింద పని ముగించుకుని మోటార్‌సైకిల్‌పై రాత్రి బయలుదేరాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో మండలంలోని శెట్టిపాలెం వద్ద ఉన్న ఏలేరు కాలువ వంతెన వద్దకు వచ్చేసరికి బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తూ పడి అక్కడక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు శుక్రవారం తెలిపారు. గోవింద మృతితో భార్య, ఆరేళ్ల కొడుకు, నాలుగేళ్ల కుమార్తెకు దిక్కెవరంటూ స్థానికులు కంటతడి పెట్టుకున్నారు.

పేదలంటే చంద్రబాబుకు ఇంత చులకనా!

- గజం ఇవ్వని వారికి సెంటు విలువ ఏం తెలుస్తుంది...
- వీసం రామకృష్ణ విమర్శ



నక్కపల్లి : తాను అధికారంలో ఉండగా పేదలకు గజం స్థలం కూడా ఇవ్వని చంద్రబాబుకు సెంటు విలువ ఏం తెలుస్తుందని ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌యుఐడీసీ) డైరెక్టర్ వీసం రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. అమరావతిలో పేదలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చే సెంటు స్థలం శవాలను పూడ్చడానికి కూడా సరిపోదని చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. బీసీలు, ఎస్సీల పట్ల హేళనగా మాట్లాడే టీడీపీ నాయకులకు, చంద్రబాబుకు పేదలంటే ఎంత చులకనో తెలుస్తోందన్నారు. రాజధాని ప్రాంతంలో పేదలు సెంటు స్థలంలో ఇల్లు కట్టుకోవడం కూడా చంద్రబాబు అండ్ కంపెనీకి ఇష్టం లేదన్నారు. రాజధాని పేరుతో వేల ఎకరాలు బలవంతంగా లాక్కొని తన అనుచరులకు కారు చౌకగా కట్టబెట్టారని, టీడీపీ ధనవంతులు కొనుగోలు చేసిన భూముల పక్కనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఐదేళ్ల టీడీపీ హయాంలో పేదలకు ఒక్క గజం స్థలం కూడా ఇవ్వలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే పేదలు చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్తారన్నారు.

400 లీటర్ల సారా పులుపు ధ్వంసం

చీడికాడ : మండలంలోని అర్జునగిరిలో శుక్రవారం సాయంత్రం 400 లీటర్లు నాటుసారా పులుపును ధ్వంసం చేసినట్టు తురువోలుకు చెందిన యువకులు తెలిపారు. రెండురోజుల క్రితం తురువోలు గ్రామంలో నాటుసారా బట్టీలను ధ్వంసం చేసి పులుపు పారబోశారు. అయితే తురువోలుకు చెందిన కొందరు సారా తయారీదార్లు అర్జునగిరి పరిసరాల్లో సారా తయారీకి సిద్ధమైనట్టు సమాచారం అందడంతో పాలిమేర తోటల్లో పరిశీలించగా సారా తయారీ సామగ్రి, పులుపును గుర్తించారు. దీంతో వాటిని ధ్వంసం చేసినట్టు గ్రామ యువకులు తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు హెల్త్ బీమా

మహారాణిపేట: దివ్యాంగ పిల్లల కోసం నిరమయ హెల్త్ స్కీమ్ కింద ఏడాది ప్రీమియం చెల్లించడానికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సంజీవని నిధి నుంచి 512 మంది విద్యార్థులకు రూ.1,34,500 అందజేసేందుకు అంగీకరించారు. జిల్లాలో మొత్తం 512 మంది దివ్యాంగ విద్యార్థులు చదువుతున్నారు. బీపీఎల్ కింద 485 మంది విద్యార్థులుండగా, ఏపీఎల్ కింద 27 మంది ఉన్నారు. బీమా కోసం బీపీఎల్ విద్యార్థి ఒక్కొక్కరి ఏడాదికి రూ.250, ఏపీఎల్ విద్యార్థి ఒక్కొక్కరి రూ.500 చెల్లించాల్సి ఉంది. అక్కయ్యపాలెం ఎన్‌జీజీవో కాలనీ హైస్కూల్ వద్ద శనివారం ఈ కార్యక్రమం జరగనుంది.

ఎర్ర చందనం తోట దగ్ధం

రూ. 3 లక్షలు ఆస్తి నష్టం


శింగవరంలో దగ్ధమైన ఎర్ర చందనం తోట

బుచ్చెయ్యపేట : మండలంలోని ఎల్.శింగవరం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో ఎకరంన్నర పొలంలో ఎర్ర చందనం తోట దగ్ధమైంది. సుమారు రూ.3 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. గ్రామంలో శిరిగిరిశెట్టి భవానికి చెందిన పొలంలో శుక్రవారం వ్యవసాయ విద్యుత్ మోటారుకు వచ్చె వైర్లు నుండి అగ్గినిప్పులు పడి ప్రమాదం సంభవించింది. గాలికి అగ్గి నిప్పులు రాజుకుని మంటలు వ్యాపించాయి. అక్కడున్న రైతులంతా మంటలను చూసి కేకలు వేయడంతో పలువురు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఎకరంన్నర పొలంలో పదిహేనేళ్ల వయస్సు గల ఎర్ర చందనం తోట కాలిపోయింది. సుమారు మూడు లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్టు బాధిత మహిళా రైతు వాపోయింది. శింగవరం, పొట్టిదొరపాలెం, శంఖరాపురం గ్రామాల రైతులంతా వచ్చి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది లేకపోతే మూడు గ్రామాలకు చెందిన సుమారు వంద ఎకరాల్లో జీడిమామిడి, సరుగుడు, యూకలిప్టస్ తోటలు కాలిపోయి తీవ్రంగా ఆస్తి నష్టం జరిగేదని పలువురు రైతులు తెలిపారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

18కిలోల గంజాయితో ఆరుగురి అరెస్టు

మాకవరపాలెం : గంజాయి తరలిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు శుక్రవారం తెలిపారు. గంజాయిని తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో గురువారం సాయంత్రం కొండలఅగ్రహారం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా బస్సులో గంజాయి తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఆటో బాల, దామోదరన్‌తోపాటు మరో నలుగురిని పట్టుకున్నామన్నారు. వీరివద్ద నుంచి 18 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఇద్దరికి రిమాండ్

నర్సీపట్నం : గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రామారావు సిబ్బందితో కలిసి గబ్బాడ వద్ద వాహన తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో బ్యాగ్‌లతో నర్సీపట్నం వైపు వస్తున్న నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి వెనకకు మరలడంతో పోలీసులు వారిని వెంబడించారు. ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా, మరో ఇద్దరు పరారయ్యారు. పిడుగురాళ్ల మండలం, జ్ఞానపాడుకు చెందిన షేక్ జహీర్ బాషా(25), రాజుపాలెం మండలం, నెమలిపురికి చెందిన ఈర్లె పవన్‌కుమార్(24) వద్ద నుంచి 8 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మండుటెండల్లో వానజల్లు

ఒక్కసారిగా మారిన వాతావరణంతో ఆహ్లాదం


విశాఖలోని గోపాలపట్నంలో కురుస్తున్న వర్షం

సాక్షి, విశాఖపట్నం : కొన్నాళ్లుగా భానుడు తీవ్రమైన ఎండలు.. వడగాడ్పులతో జనాన్ని బేజారెత్తిస్తున్నాడు. ఉష్ణతాపంతో అల్లాడిపోతున్న జనంపై వరుణుడు కరుణించాడు. శుక్రవారం సాయంత్రం కొన్నిచోట్ల, రాత్రి మరికొన్ని ప్రాంతాల్లోనూ ఆకస్మికంగా పన్నీటి జల్లులు కురిపించాడు. దీంతో చాలా రోజులుగా చల్లదనం, వర్షం కోసం పరితపిస్తున్న వారికి కొండంత ఊరటనిచ్చాడు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అనకాపల్లి జిల్లా మినహా విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. దీంతో సెగలుకక్కే వాతావరణం నుంచి హాయిగొలిపే వాతావరణానికి మారిపోయింది. తొలుత ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు ఒకింత హడావుడి చేసినా ఆ తర్వాత అవి కూడా కనుమరుగయ్యాయి. ఈదురుగాలుల ప్రభావంతో నగరంలో ఒకట్రెండు చోట్ల కొంతసేపు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. విశాఖ నగరం నలుమూలలా చెప్పుకోదగిన స్థాయిలో కురిసిన వర్షానికి నగరవాసులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఎంత హాయి.. ఈ రేయి అంటూ అనూహ్యంగా మారిన ఈ ఆహ్లాదకర పరిస్థితిని ఎంతగానో ఆస్వాదించారు.

చల్లబడిన మన్యం

సాక్షి, పాడేరు: గత వారం రోజుల నుంచి అధిక ఎండలతో ఇబ్బందులు పడిన మన్యం వాసులకు శుక్రవారం చల్లటి వాతావరణంతో ఉపశమనం ఏర్పడింది. పాడేరుతో పాటు సమీప గ్రామాలలో వర్షం కురిసింది. పాడేరు పట్టణంలోని ఐటీడీఏ ప్రాంగణం ,సినిమాహాల్ సెంటర్, పాతబస్టాండ్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. సంత ప్రాంతం నుంచి వంతాడపల్లి, కందమామిడి, మినుములూరు, పాడేరు ఘాట్‌లో సుమారు గంట సమయం పాటు భారీ వర్షం కురిసింది.జిల్లాలో శుక్రవారం కురిసిన వర్షానికి చింతపల్లిలో 3.7 సెంటీమీటర్లు, ముంచంగిపుట్టులో 1.4 సెంటీమీటర్లు, వై.రామవరంలో 1.30 సెంటీమీటర్లు, అడ్డతీగలలో 1.0 సెం.మీ వర్షపాతం నమోదైంది.

పెదబయలు: మండలంలో శుక్రవారం సాయంత్రం ఒక్క సారిగా మేఘాలు ఏర్పడి వర్షం కురిసింది.ఈదురుగాలులకు పలు చోట్ల చెట్టు కొమ్మలు విద్యుత్ వైర్లపై పడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సిబ్బంది కొమ్మలను తొలగించి సరఫరాను పునరుద్ధరించారు.


అరకులోయ రూరల్: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వరకు ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. జన జీవనం స్తంభించింది.


చింతపల్లిలో కురుస్తున్న వర్షం

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో ఉరుములు,మెరుపులు.ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది.చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లపై పడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

క్లుప్తంగా

శివుని విగ్రహానికి రంగులు



ఆకట్టుకుంటున్న శివుని భారీ విగ్రహం

కశింకోట : స్థానిక గవరపేటలోని సాధుమతం శ్మశాన వాటికలో నిర్మించిన శివుని విగ్రహం ఆకట్టుకుంటోంది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో దాతల సహకారంతో శ్మశానాన్ని అభివృద్ధి చేశారు. దీనిలో భాగంగా 13 అడుగుల భారీ శివుని విగ్రహాన్ని సుమారు రూ.2 లక్షలు వెచ్చించి స్థానికులైన కొణతాల ధర్మారావు జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యుల సహకారంతో నిర్మించారు. దీనికి ఇటీవల రూ.35 వేలు వెచ్చించి అందంగా రంగులతో తీర్చిదిద్దారు. అది చూపరులను విశేషంగా అలరిస్తోంది.

డీఈవోకు టీచర్ల వినతి



డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లిటౌన్ : తమకు రావాల్సిన జీతం ఇప్పించాలంటూ డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మను స్థానిక జీవీఎంసీ పెద హైస్కూల్ ఉపాధ్యాయులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. స్కూల్ హెచ్ఎం శర్మ మధురవాడ నుంచి హైస్కూల్‌కు డిప్యుటేషన్‌పై వచ్చి ఏడాది పూర్తయింది. అతని డిప్యుటేషన్ పొడిగించడం గానీ, ఆయన స్థానంలో వేరొకరిని కేటాయించడంగానీ చేయాలేదు. దీంతో ఉపాధ్యాయుల జీతాల బిల్లులపై ఆయన సతకం చేయలేదు. ఈ సమస్యను పరిష్కరించి, తమకు జీతాలు వచ్చేలా చూడాలని డీఈవోకు విన్నవించుకున్నారు.

23 నుంచి సంచార ఆధార్ శిబిరాలు

కశింకోట : మండలంలోని సచివాలయాల వారీగా ఈ నెల 23 నుంచి సంచార ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ మేరకు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెలాఖరు వరకు నిర్దేశిత సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మొదటి రోజైన 23న కశింకోట-1, జి.భీమవరం, జమాదులపాలెం, తీడ, 24న కశింకోట-2, జి.భీమవరం, చింతలపాలెం, తీడ, 25న కశింకోట-3, తాళ్లపాలెం-2, చింతలపాలెం, తీడ, 30న ఏఎస్ పేట, వెదురుపర్తి, జెట్టపురెడ్డితుని, తాళ్లపాలెం-1, 31న ఏఎస్ పేట, బయ్యవరం, జెట్టపురెడ్డితుని, తాళ్లపాలెం-1 సచివాలయాల్లో శిబిరాలు జరగనున్నట్లు వెల్లడించారు. ఆధార్ అప్‌డేట్, సవరణలు తదితర వాటి కోసం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 129 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,690	4,900
రెండో రకం	4,030	4,500
మూడోరకం	--	--

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
రామబాణం	: సత్యనారాయణ-1
అన్నీ మంచి శకునములే	: సత్యనారాయణస్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డీసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
ఫాస్ట్ ఎక్స్	: వెంకటేశ్వర
ఉగ్రం	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 105 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-31 యూనిట్లు, ఓ పాజిటివ్-68 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 326 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 288 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

అమృత ఫలం.. విషతుల్యం

ఫలాల్లో రారాజు మామిడి. వేసవి వస్తుందంటే చాలు మామిడి పండ్ల కోసం ఆశగా ఎదురుచూడని వారుండరంటే అతిశయోక్తికాదు. అలాంటి మామిడి పండు విషతుల్యంగా మారుతోంది. గతంలో పండ్లను సహజంగా పక్వానికి తీసుకొచ్చి, మార్కెట్‌కు తరలించేవారు. ప్రస్తుతం వ్యాపారులు కాయలను నిషేధిత కాల్షియం కార్బైడ్ వినియోగించి మాగబెడుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నారు.

- కృత్రిమంగా మాగబెడుతున్న వ్యాపారులు
- నిషేధిత రసాయనాలతో ఆరోగ్యంపై ప్రభావం



మాగబెట్టేందుకు సిద్ధంగా ఉన్న మామిడి కాయలు



కార్బైడ్‌తో మాగబెట్టగా రంగు మారిన మామిడి

అనకాపల్లి రూరల్ : ప్రస్తుతం మార్కెట్‌లో ఎక్కడ చూసినా మామిడి పండ్లు కనిపిస్తున్నాయి. పచ్చగా కనిపించే ఈ పండ్లన్నీ సహజంగా పండినవే అనుకుంటే పప్పులో కాలేసినట్టే. మామిడి కాయలను ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్‌తో మగ్గించి విక్రయిస్తున్నారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే కాల్షియం కార్బైడ్ వినియోగాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2012లోనే నిషేధించింది. ఆరోగ్యకర పద్ధతుల్లో పండ్లను సహజత్వానికి దగ్గరగా మగ్గబెట్టాలని సూచించింది. సాధారణంగా పండ్లు పక్వానికి వచ్చినపుడు ప్రకృతి సిద్ధంగా వాటి నుంచి ఉత్పత్తయ్యే ఇథిలీన్‌తో మగ్గుతాయి. ఇలా పండిన పండ్లు రంగు, రుచి, వాసనతో ఆరోగ్యదాయకంగా ఉంటాయి.

రంగును చూసి గుర్తించొచ్చు

కార్బైడ్, ఇతర రసాయనాలు ఉపయోగించిన మామిడి పండ్లు బయటకి లేత పసుపు, లోపల లేత తెలుపు రంగులో ఉంటాయి. సహజంగా పండిన పండు బయట, లోపల ఒకే వర్ణంలో ఉంటుంది. రంగును చూసి చాలా వరకు గుర్తించొచ్చు. రసాయనాలు విడుదల చేసే ఎసిటిలీన్ వాయువుతో పండ్లు బయటవైపు రంగు మారుతుందే తప్ప, అంత రుచిగా ఉండవు. వ్యాపారులు మామిడి కాయలను రైతుల నుంచి కొనుగోలు చేసి ఎథ్రిల్ లిక్విడ్‌లో 5 నిమిషాలు ముంచి 3-4 రోజులు నిల్వ చేస్తే సహజత్వానికి దగ్గరగా మాగుతాయి. ముంచడం సాధ్యంకాని పరిస్థితుల్లో ఎథ్రిల్ లిక్విడ్‌ను కాయలకు స్ప్రే చేస్తే చాలు. కొందరు వ్యాపారులు కాయలను కొనుగోలు చేసిన 24 గంటల్లోనే మేలిమి పండులా కనిపించేందుకు పరిమితికి మించి కార్బైడ్‌ను వినియోస్తుండటంతో ఆరోగ్యానికి ముప్పు తప్పట్లేదు. ప్రభుత్వం అమోదించిన ఇథలీన్‌తో పోల్చితే కార్బైడ్, ఇతర రసాయనాలు చౌకగా లభిస్తుండడంతో వీటిని వ్యాపారులు యధేచ్ఛగా వినియోగిస్తున్నారు.

ఆరోగ్యానికి తప్పని ముప్పు

రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండ్లు తింటే ఆరోగ్య సమస్యల బారినపడే ప్రమాదముంది. దీర్ఘకాలికంగా ఇలాంటి పండ్లు తీసుకోవడం ద్వారా క్యాన్సర్, అల్సర్, కాలేయం(లివర్), మూత్రపిండ సంబంధిత వ్యాధులు, జీర్ణ సంబంధిత వ్యాధులు, కాళ్లు, చేతులకు తిమ్మిర్లు, నరాల బలహీనతలకు గురయ్యే అవకాశం ఉంది. కాల్షియం కార్బైడ్ వెలువడే ఎసిటిలీన్ వాయువు నాడీ వ్యవస్థ మీద ప్రభావం చూపి తలనొప్పి దీర్ఘకాలిక మత్తు, శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తుతాయి. కొన్నిసార్లు విరేచనాలు అవుతాయి. గర్భిణుల్లో హార్మోన్ల బ్యాలెన్స్ తప్పుతాయి.

నిబంధనలు ఏం చెబుతున్నాయి

ఆహార భద్రత, ప్రమాణాల నిబంధనలు-2011 ప్రకారం పండ్లను కృత్రిమంగా పండించేందుకు ఉపయోగించే కార్బైడ్, ఎసిటిలీన్ రసాయనాలను ప్రభుత్వం నిషేధించింది. సహజంగా పండించడంలో కీలక పాత్ర పోషించే ఇథిలీన్ వాయువు 100 పీపీఎం వరకు వినియోగించొచ్చు. నిబంధనల ప్రకారం సుమారు 20 కిలోల మామిడి పండ్లకు 5 గ్రాముల ఇథిలీన్‌ను వినియోగించాలి. ఈ వాయువు 24 గంటలు మామిడి కాయలకు తగిలేలా ఉంచితే 5 రోజుల్లో సహజత్వానికి దగ్గరగా ఎలాంటి హాని లేకుండా పక్వానికి వస్తాయి. ఆహార సురక్ష ప్రమాణాల చట్టం ప్రకారం కాల్షియం కార్బైడ్‌తో మామిడి పండ్లను మాగించకూడదు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించేవారికి ఏడాది జైలు, రూ.3 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది.

కాల్షియం కార్బైడ్ ఆరోగ్యానికి హానికరం



కృత్రిమంగా పండించిన పండ్లు తినడం ద్వారా అనారోగ్య సమస్యలు రావొచ్చు. కాల్షియం కార్బైడ్ ద్వారా వెలువడే ఎసిటిలీన్ వాయువు నాడీ వ్యవస్థ మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. కృత్రిమ పండ్లు ఎక్కువగా తినడం ద్వారా శరీరంలో ఫాస్పరస్ ఆర్సెనిక్ చేరి మగత, తిమ్మిర్లు, తలనొప్పి, బీపీ తగ్గడం వంటి రుగ్మతలకు గురవుతారు. గర్భిణులు ఇలాంటి వాటిని తినకపోవడమే మేలు.

– ఎస్.వాణీ జగదీశ్వరి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, తుమ్మపాల

బస్ షెల్టర్ నిర్మాణానికి స్థల పరిశీలన



పూడిమడకలో స్థల పరిశీలన చేస్తున్న ఎంపీ సత్యవతి, ఎన్‌హెచ్ ప్రాజెక్టు అధికారి పాత్రో

అనకాపల్లిటౌన్ : పూడిమడక జాతీయ రహదారిలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసేందుకు ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. జాతీయ రహదారి ప్రాజెక్టు అధికారి రజనీకాంత్ పాత్రోతో కలిసి ఉమ్మలాడ, పూడిమడక జంక్షన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి పూడిమడక జాతీయ రహదారిమీదగా రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, శ్రీశైలం, తిరుపతి, కడప, హైదరాబాద్, బెంగళూర్, చెన్నై, శ్రీకాకుళం, టెక్కలి, ఇచ్ఛాపురం, పార్వతీపురం, రాయగడ వంటి దూర ప్రాంతాలకు ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ), ప్రైవేట్ బస్‌లు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. వీటి కోసం ప్రయాణీకులు నిత్యం రహదారిపైనే నిరీక్షించాల్సి వస్తోందన్నారు. బస్‌షెల్టర్ లేకపోడంతో ఎండాకాలంలో, రాత్రి సమయంలో, వర్షాకాలంలో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థలపరిశీలన తర్వాత ఎంపీ నిధులతో బస్‌షెల్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. మునగపాక మండలం ఉమ్మలాడ ప్రజలు ఉమ్మలాడ-అనకాపల్లి రోడ్డులోప్రమాదాలు జరిగి సుమారు 30మంది మరణించారని, ఇక్కడ అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో ఎంపీ వెంట జాతీయ రహదారి అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించండి'



పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారించాలంటు నిరసన చేస్తున్న బల్లా నాగభూషణం

తుమ్మపాల : పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కార్యాలయం వద్ద సిద్ధార్థ సోషల్ సర్వీస్ అసోసియేషన్ ప్రతినిధులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. జిల్లా ప్రధాన కేంద్రంగా పట్టణంలో విపరీతమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం అన్నారు. పెరిగిన పట్టణ జనాభా, జిల్లా ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలన్నీ పట్టణంలోనే ఏర్పాటవడంతో రాత్రుళ్లు కూడా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందంటూ ఆర్డీవో చిన్నికృష్ణకు వినతి అందించారు. ట్రాఫిక్ యంత్రాంగం సమన్వయంతో చర్యలుచేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వినకోట నీలేష్‌గుప్తా, సహాయ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, బుద్దిస్ట్ సొసైటీ అధ్యక్షుడు పూడి బాలరాజు పాల్గొన్నారు.

పశువైద్యశాల భవన నిర్మాణానికి ప్రతిపాదనలు



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రసాద్

అనకాపల్లిటౌన్ : గవరపాలెం పశు వైద్యశాలకు ఆర్ఏడీఆర్ నిధులతో కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్టు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బి.ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆస్పత్రిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పశువులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని సూచించారు. భవనం శిథిలావస్థకు చేరుకుందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన భవనం, ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యుడు సీహెచ్ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సేవకులకు ఘన సత్కారం



కలెక్టర్, ఎంపీ చేతుల మీదుగా సేవా వజ్ర, సేవా రత్న పురస్కారాలు అందుకున్న గ్రామ వలంటీర్లు

కశింకోట : మండలానికి చెందిన ఏడుగురు గ్రామ వలంటీర్లు ప్రభుత్వం ప్రకటించిన సేవా వజ్ర, సేవా రత్నా పురస్కారాలను శుక్రవారం అందుకున్నారు. అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం జరిగింది. కన్నూరుపాలెం(ఈ చౌడువాడ)కు మురమల్ల లలితకుమారి, వర్రి భవానిలు సేవా వజ్ర పురస్కారాలను, ఇదే గ్రామానికి చెందిన పేకేటి దేవీకుమారితోపాటు నూతలగుంటపాలేనికి చెందిన సోమిరెడ్డి పార్వతి, తెలపల లక్ష్మి, మారిశెట్టి దుర్గా వెంకటలక్ష్మి(జి.భీమవరం), మదిని మమత(వెదురుపర్తి)లకు సేవా రత్న పురస్కారాలను అందించారు. ఈ మేరకు వారికి దుశ్శాలువా కప్పి, ప్రశంసాపత్రం, పతకం, బ్యాడ్జిలతో సత్కరించారు. సేవా వజ్ర పురస్కారానికి రూ.30 వేలు, సేవా రత్న పురస్కార గ్రహీతలకు రూ.20 వేలు వంతున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులు గ్రామ వలంటీర్లు



వలంటీర్ లోకేశ్వరిని అభినందిస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల పంచాయతీలో వలంటీర్‌గా సేవలందిస్తున్న మామిడి లోకేశ్వరి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన సేవారత్న అవార్డు పొందడంతో ఆమెను శుక్రవారం సత్కరించారు. తుమ్మపాల గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, పంచాయతీ కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాస్‌లు లోకేశ్వరికి దుశ్శాలువా వేసి, పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. పలువురు పంచాయతీ సిబ్బంది, గ్రామ వలంటీర్లు లోకేశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు సత్వరంగా అందుతున్నాయన్నారు. నిస్వార్థ సేవలకు వలంటీర్లు చిరునామాగా అని కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల మనిషి పుచ్చలపల్లి సుందరయ్య



పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి నివాళులు



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కశింకోట : స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుందరయ్యను ప్రజల మనిషిగా కొనియాడారు. ఆయన త్యాగాలను వక్తలు ప్రస్తుతించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, సీపీఎం నాయకురాలు డి.డి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38 వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్ర పటానికి సీపీఎం నాయకులు ఎస్.రమణ, పి.మాణిక్యం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ ఆదర్శ కమ్యూనిస్టుగా, అజాతశత్రువుగా పిలవబడే సుందరయ్య నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నేతగా మన్ననలు పొందారన్నారు. ప్రజాసేవ కోసం పిల్లలే వద్దనుకున్న త్యాగశీలి అని కొనియాడారు. తన ఆస్తిని పార్టీకిచ్చి పేద ప్రజల కోసం నిరంతరం శ్రమించిన ఆదర్శమూర్తి అని శ్లాఘించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.రమణ, నాయకులు తరుణ, జీవీఎస్ తేజ, కె. మనోజ్, రమణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వలస పక్షుల సంచారం

కశింకోట : మండలంలో వలస పక్షులు సంచరిస్తూ చూపరులను అలరిస్తున్నాయి. కశింకోట, తేగాడ, తాళ్లపాలెం తదితర ప్రాంతాల్లో పంట పొలాలు, శారదానది నది ప్రాంతంలో ఇవి సంచరిస్తున్నాయి. పంట భూముల్లో పురుగులు, నదిలో చేపలు తింటూ తిరుగాడుతున్నాయి. వీటిని స్థానికులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తూ ఆనందం పొందుతున్నారు.

ఫై.. డే సలసల

కశింకోట : మండల ప్రజలు ఉక్కపోత, అధిక ఉష్ణోగ్రతతో శుక్రవారం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రం ఆకాశంలో మబ్బులు వేసి వాతావరణం కాస్త చల్లబడింది. దీంతో రోడ్లపై జన సంచారం కాస్త పెరిగింది.

హిందీ భాష ప్రాధాన్యంపై అవగాహన



అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో హిందీ భాషపై అవగాహన కల్పిస్తున్న తేజాంబిక

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో హిందీ భాషపై అవగాహన కల్పించారు. వేసవి గ్రంథాలయ శిక్షణ తరగతుల్లో భాగంగా 12వ రోజైన శుక్రవారం విద్యార్థులకు అచ్యుత స్కూల్ ఉపాధ్యాయురాలు తేజాంబిక భాషల ప్రాధాన్యాన్ని వివరించారు. త్రిభాషలు చదవాల్సిన అవసరం ఉందని, తద్వారా ఎక్కడికి వెళ్లినా విద్యాభాసానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కోటేశ్వర రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు బ్రేక్

- హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో శేషు

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు రెవెన్యూ అధికారులు బ్రేక్ వేశారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని శుక్రవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వివరాలు.. మండలంలోని గొల్లలపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 268లో ఉన్న జిరాయితీ భూమిని రైతుల నుంచి రియల్టర్లు కొనుగోలు చేశారు. సదరు జిరాయితీ భూమి 268 సర్వే నెంబర్‌లో 268-2 నుంచి 268-8 వరకూ సబ్ డివిజన్లలో ఉండగా, అదే జిరాయితీ భూమిని ఆనుకుని సర్వే నెంబర్ 268-9లో 1.53 ఎకరాల ప్రభుత్వ భూమి(గయాళు) ఉంది. లక్షలాది రూపాయల విలువ చేసే ఈ ప్రభుత్వ భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కళ్లు పడ్డాయి. దీంతో దొరికిందే అవకాశంగా ప్రభుత్వ భూమిని మూడు రోజులుగా చదును చేసి ట్రాక్టర్లతో దున్నేసి ఆక్రమణకు పాల్పడుతున్నారు. దీంతో స్థానిక రైతులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ బి. సత్యనారాయణ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, వీఆర్వో పూడి శేషు, విలేజ్ సర్వేయర్ హరి భూమిని సర్వే చేశారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 268/9లో ఉన్నట్లు గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 268/1లో జగనన్న కాలనీ లే అవుట్ వేశామని, సర్వే నెంబర్ 268/9లో 1.53 ఎకరాల ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందన్నారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇకపై ఎవరైనా ఆక్రమించడానికి ప్రయత్నిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన వారిలో రెవెన్యూ సిబ్బంది ముదపాక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

10 వరకు వేసవి ఉచిత శిక్షణ



వ్యాయామ శిక్షణలో విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని వేల్పులవీధి వ్యాయామ సంఘం చైర్మన్ ఉగ్గిన అప్పారావు అన్నారు. స్థానిక వ్యాయామశాలలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామ సంఘం ఆధ్వర్యంలో వందలాది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని వెల్లడించారు. వేసవి శిక్షణా తరగతులను జూన్ 10 వరకూ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉపాధ్యక్షులు పెదిరెడ్ల రమేష్, వాకాడ సతీష్, కార్యదర్శి లక్కరాజు రమేష్, కోశాధికారి వెదుళ్ల నూకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ డీపీఎం స్వామినాయుడు

మునగపాక: మండలంలోని చూచుకొండ, గణపర్తి గ్రామాల్లో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఖరీఫ్ పంటల సాగు చేపట్టే ముందు తీసుకోవాల్సిన చర్యలపై అడిషనల్ డీపీఎం స్వామి నాయుడు అవగాహన కల్పించారు. ముందుగా భూమిలో 30 రకాల విత్తనాలను పప్పుజాతి, తీగ జాతి, ఆకుకూరలు, సుగంధ ద్రవ్యాలు, నూనె జాతి రకాల విత్తనాలను వేసి కలియ దున్నడం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయం సాగుపై దృష్టి సారించాలన్నారు. పీఎండీఎస్ విత్తనాలను పశువులకు మేతగా, భూములకు సూక్ష్మ జీవులను అందించేలా దోహదపడతాయన్నారు. ఇవి వేసిన 45 రోజుల తర్వాత భూమిలో కలియ దున్నితే భూమి సారవంతంగా ఉంటుందన్నారు. తద్వారా ఆరోగ్యరమైన పంటలు పండించవచ్చన్నారు. రైతులు కూడా మారుతున్న కాలంతో పాటు వ్యవసాయం సాగులో నూతన పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోండి



ఆన్‌లైన్ లింక్ ద్వారా పాఠ్యపుస్తకాల డౌన్‌లోడ్‌ను వివరిస్తున్న ఎంఈవో అప్పలరాజు

సబ్బవరం: పాఠశాలలు తెరిచేవరకూ విద్యార్థులు ఆన్‌లైన్‌లో తరగతుల వారీగా పొందుపరిచిన పాఠ్య పుస్తకాలను డౌన్‌లోడ్ చేసుకుని చదువుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు తెలిపారు. ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకూ తరగతులు, సబ్జెక్టుల వారీగా, డౌన్‌లోడ్ చేసి, చదువుకునేందుకు వీలుగా ఈ పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి సాయంతో వేసవి సెలవుల్లో విద్యార్థులు నేర్చుకునేందుకు వీలవుతుందని, అందుకు ఉపాధ్యాయులు విద్యార్థులకు తగిన సూచనలు చేయాలని కోరారు. దీనిలో భాగంగా శుక్రవారం సబ్బవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ లింక్ ద్వారా ఏ విధంగా పాఠ్యపుస్తకాలు డౌన్‌లోడ్ చేసుకోవాలో ఆయన వివరించారు. ఎంఐఎస్ కో ఆర్డినేటర్ మహేష్, ఆర్పీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న, గణేష్, సంతోషి దంపతులు

అనకాపల్లిటౌన్ : స్థానిక గౌరీ పంచాయతన ఆలయంలో గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. కాండ్రేగుల గణేష్, సంతోషి దంపతులచే ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్య నారాయణశాస్త్రిలు ఊంజల్ సేవ నిర్వహించారు. అంతకుముందు అమృతవర్షిణి పెతకంశెట్టి సుజాత శిష్య బృందం కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, పాలకవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.